ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక :

# ★ పోరు నష్టం ★

అచ్చరాజుపేట యిటు పల్లెటూరుకాదు, అటు పట్టణమూ కాదు మధ్యరకపు నాటుబస్తీ. ఊళ్ళోనే కలసున్న పంటచేలు, తోటలూ. గ్రామశోభని పెంపొందింపచేస్తూ కనిపిస్తాయి రైస్‌మిల్, సినిమా హాలూ కాస్త పట్టణనాగరికతను వెదజల్లుతూవుంటాయి. అచ్చరాజుపేటలో అతిథి సత్కారంకోసం పాతపద్ధతిలోని సత్రము వుంది, డబ్బు పుచ్చుకొని భోజనవసతి సౌకర్యాలు చేకూర్చే హోటలూవుంది. అమాయకులైన గ్రామీణులూ, ఆడంబరం పాలు హెచ్చయిన నవనాగరీకులూ, పాలూ నీరులా కలిసిపోయున్నారు. అప్పుడప్పుడే నెలకొంటున్న తపాలా ఆఫీసూ, విద్యుద్దీపాలూ, పంచాయితీబోర్డు, హైస్కూలు వగైరా హంగులన్నీ నిద్రాణమైయున్న జాతి జాగృతీకరణ మవుతున్నందులకు నిదర్శనంగా వున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అది పట్టణంగా రూపొందుతున్న గ్రామమని చెప్పుకోవచ్చు.

అచ్చరాజుపేటని అంతవరకూ ఏకఛత్రాధిపత్యాన ఏలినవాడు ధర్మానాయుడు. పేటకంతకీ మోతుబరి ఆసామి పేరులోనున్న ధర్మం, అప్పుడప్పుడూ నేతిబీరకాయలోని నేతితత్వమే అవుతూంటుంది. తన అధికారం సాగినంతకాలం గ్రామప్రజలకి సింహస్వప్నంలా సంచరించాడు. కానీ, పంచాయితీ ఎన్నికలు జరిగి, ప్రెసిడెంటుపాలన వచ్చినప్పటినుండి ధర్మానాయుడి అధికారప్రాబల్యం కృష్ణపక్షపు చంద్రకళల్లా దినదినానికీ క్షీణించడం ప్రారంభించింది. అందుకు అతడు లోలోపల కిటకటపడుతూనే చేసేదిలేక అధికారం చేజిక్కించుకునే అవకాశ సమయాలకోసం కాసుక్కూర్చున్నాడు. వచ్చే ఎన్నికల్లో పంచాయితీకి పోటీచేసి ప్రెసిడెంటు కావాలని ఉత్సాహపడుతున్నాడు. ఊళ్ళో అతనికి వత్తాసువచ్చే బలగానికి, సైయ్యంటే సైయ్యనే సహచరులకి, వెనకవేసుకొనివచ్చే అప్తులకీ లోటేమీ లేదు కనుక తను ఎటూ ఎన్నిక కాగలననే ధీమాతోటి ధర్మానాయుడు రెండు చేతులా డబ్బు విరజిమ్ముతున్నాడు.

ధర్మానాయుడు వీధరుగుమీద కూర్చొని తాపీగా చుట్టకాల్చుకుంటున్నాడు ఇంతలో వీరసెట్టీ చంద్రారెడ్డి హడావిడిగా వచ్చి అరుగు చివరన చతికిలబడ్డారు.

---

రచన:

**యస్. వి. సత్యనారాయణమూర్తి**

---

"ప్రెసిడెంటు మాధవరావు విజ్ఞప్తి కాగితాలు అచ్చేయిస్తున్నాట్ట. విన్నారా?" అన్నాడు చంద్రారెడ్డి సంభాషణ ప్రారంభిస్తూ ...

"అట్టాగా" అని ఉమ్మేసి తనకేమీ పట్టనట్టు నిశ్చింతగా వూరుకున్నాడు ధర్మానాయుడు.

"మరి మన మాటో? మనవూ ఒక అయిదువేలు అచ్చే యిద్దారి."

"వేఁం వెర్రి అంటే యిదేనయ్యా రెడ్డీ. పులినిచూసి నక్క వాతలు పెట్టుకుందన్నట్టు.... మాధవరావెంత జేసు. వాడి బోడి విజ్ఞప్తి కాయితాలెంత జేసు నిన్నగాక మొన్నటిదాకా వాడూ నాతో భుజాలురాసుకు తిరిగిన పెద్దమనిషే. అతగాడేదో మహా ఊడబొడి చేస్తున్నాడని మీ అభిప్రాయంగా మోసు. ఆ సంగతి విడిచిపెట్టు. నేనొక కొత్త ఎత్తు వేసా."

"ఏమిటీ?" వీరిసెట్టీ, చంద్రారెడ్డి ఒకేమారు ఆశ్చర్యంగా అడిగారు. ధర్మానాయుడు కాసేపు కోరమీసాలను దిద్దుకుంటూ మాట్లాడలేదు. ఆలోచనలో మునిగిపోయాడు. సెట్టీ, రెడ్డీ నాయుడు బెల్లంకొట్టిన రాయిలా మెదలకుండా వూరుకొనడానికి కారణమేమిటా అని మొహాలు చూసుకుంటూ కూర్చున్నారు. నాయుడు చుట్టను రెండు, మూడు దమ్ములులాగి, కొడిదులిపి గొంతు సవరించుకున్నాడు. వీరిసెట్టీ, చంద్రారెడ్డీ నాయుడు చెప్పేదేమిటో వినడానికి చెవులు రిక్కించుకొని కాచుకున్నారు. నాయుడి ఆలోచనలు ఎప్పుడూ పెద్దెత్తుమీదే ఉంటాయనీ, వీలైతే తోసిరాజూ - ఆటకట్టూ చెప్పేంతటివాడనీ వారిరువురికీ తెలుసు. రాజ(కీయ) నీతిలో ధర్మానాయుడు అపర చాణక్యుడే!

"మరెవ్వరితోనూ అనబోయారు జాగ్రత్త. ఈ విషయం పరాయివాడి చెవిలో పడకూడదు. పల్లంవీధి ఓట్లూ, బజారు సెంటరు ఓట్లూ మనకే ఖాయం చేయించాను. కాస్త హెచ్చుగా డబ్బు ఖర్చైనప్పటికీ ఆ ప్రాంతాల్లోనే మొత్తం ఓటర్లలో సహం మందున్నారు. కాగా మనవారందరి ఓట్లు జమకూడా కట్టుకుంటే మెజారిటీకి ఎక్కి, తొక్కని ఇక మాధవరావు కాయితాలు వేయించనీ, సభలు పెట్టించనీ, దిక్కులు పిక్కటిల్లేట్టు ప్రచారం చేయించనీ; ఏమైనా చేసుకోనీయండి గొప్పవారిది. గెలుపు మనది. మనకు ఆరుస్థానాలూ ఒక్కటీ బీరుపోకుండా రావడం ఖాయం. నేను ప్రెసిడెంటు పదవి చేబట్టడమూ తథ్యం. ఇక చెప్పాల్సినదేముంది. ఈ దెబ్బతో మాధవరావూ, వాడి తలలో జేజెమ్మలూకూడా శంకరగిరి మాన్యాలు పట్టాల్సిందే"

వీరిసెట్టీ, చంద్రారెడ్డీ నోళ్ళు తెరిచారు.

"ఇక మాధవరావు నోట్లో మట్టిగడ్డ పడ్డట్టే!" అన్నాడు చివరికి గుక్కతిప్పుకున్న చంద్రారెడ్డి.

"వెయ్యక వెయ్యక భలే ఎత్తువేశారు నాయుడుగారు. లేకపోతే వాడికీ, మీకూ

పోలికేమిటి? సింహానికీ, చిట్టెలుకకీ సాపత్యమా?'' అన్నాడు నాయుడి ప్రతిభను ఆకాశాని కెత్తేస్తూ వీరిశెట్టి.

నాయుడు విలాసంగా మీసం మెలిపెట్టి బిగ్గరగా నవ్వుతూ 'ఇవో లెక్కా' అన్నాడు

''ఏదీ?'' అన్నాడు అప్పుడే వచ్చిన పంతులు గొడుగు ముడుస్తూ. ఎండా, వాన ఏదీలేని వేళకూడా పంతులు గొడుగు వేసుకునే వస్తాడు. ''ఇంట్లోకూడా గొడుగువేసుకునే తిరుగుతావేమిటయ్యా? పంతులూ!'' అని పరిచయస్థులు వేళాకోళం చేసినా పంతులు వూరుకుంటాడు. ఎండా, వానల్ని లెక్కచెయ్యకుండా నిరంతర ఛత్రధారియై ఎదుటబడిన వారినందరినీ శత్రు మిత్రులనే విచక్షణలేకుండా పలకరిస్తూ యోగక్షేమాలు విచారిస్తూంటాడు. అతడి అసలు పేరు జోగయ్యపంతులు అయినప్పటికీ, దానికంటే ''గొడుగుపంతులు'' అనే పేరే ఎక్కువగా ఊర్లోవాడుక. గొడుగుపంతులంటే శనివారం, శనివారం అతడింట్లో కొబ్బరికాయముక్కలు, బెల్లంపానకం, ప్రసాదంకోసం ఎగబడే పిల్లకాయల మొదలు, తాతలనాటి సంగతులు ముచ్చటించే ముసలికాళ్ళ ముదుసళ్ళవరకు బాగా పరిచయమే.

తనతోబాటుగా 30 సంవత్సరాలుగా వుంటున్న ఆ గొడుగంటె పంతులుకి చాల ప్రేమ. అది కాలక్రమేణా అతడి ట్రేడ్ మార్కుగా అయిపోయింది. తను స్వాతంత్రపోరాట దినాల్లో పెద్ద పెద్ద నాయకు లెందరితోనో ఆ గొడుగుక్రింద తిరిగేనని సగర్వంగా చెప్పుకుంటాడు పంతులు. అతడు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నవాడు గనుక అది అబద్ధమనడానికి ఆస్కారంలేదు.

అచ్చరాజుపేట రాజకీయాల్లో పంతులికి ప్రత్యేక ప్రాధాన్యముంది. అతడిమాటకి గౌరవమిచ్చేవారూ, అతడి సలహాకి విలువగా ఎంచుకొనేవారు ఊళ్లో చాలామంది న్నారు. అతడు లేకుండా ఏసభా, సమావేశమూ జరగదు. పంతులు నిజానికి మంచివాడే. కానీ అతడిలో ఒక బలహీనతుంది తనని పొగడేవారికి యిట్టే వశుడైపోతాడు. తనుపట్టిన కుందేటికి మూడే కాళ్ళన్నట్లు తనకు నమ్మకంగా తోచినదే చేసితీరాలని పట్టుబడతాడుగానీ అందులోని మంచి-చెడ్డలు, సులువు-బలువులూ అట్టే గమనించడు.

ఒకమారు పంతులు యిల్లు అగ్ని ప్రమాదంవల్ల కాలిపోగా నాయుడు సమయానికి తన బలగంతో ఆదుకొని, వారం రోజుల్లో యిల్లును సరికొత్తగా కట్టించి యిచ్చాడు. ఇప్పుడు పంతులికి ధర్మానాయుడి మాటంటే వేదవాక్కు. రామబంటు హనుమంతుడిలా నాయుడు అనుజ్ఞ యిస్తే చాలు తెగించి బరిమీదకు దుమకడానికి సిద్ధంగా వుంటాడు పంతులు. అతను రాజకీయాల్లో తలనెరిసినవాడే అయినప్పటికీ అందులో జిత్తులూ, ఎత్తులూ వంటబట్టినవాడు కాదు. అందుకే నాయుడి చేతిలో వంటింటి కుందేలు బాపతుగా చలామణీ అవుతున్నాడు. అత్యవసర సమయాల్లో పంతుల్ని పావుగా ప్రయోగిస్తాడు నాయుడు. పంతులు మాత్రం ఆ కార్యం తను స్వయంగా చేస్తున్నట్లు ''చక్రం అడ్డేస్తాను.'' అంటాడు.

''రావయ్యా! పంతులూ! రా. రా. నీకు వెయ్యేళ్లు ఆయుస్సు మనసులో నీ మాట మెదులుతుండగానే వచ్చిపడ్డావు'' అంటూ సాదరంగా ఆహ్వానించాడు నాయుడు. పంతులు అరుగు మీద నాయుడిప్రక్క కూర్చున్నాడు.

''రైసుమిల్లు జనం ఓట్ల మాటేమైంది? కాయా, పండా?'' మెల్లగా అసలు విషయం కదిపాడు నాయుడు.

పంతులు పైకండువాతో మొహం అద్దుకుంటూ ''పంతులు ప్రయత్నించడం. పని కాయ కావడమూనా? నీ పంట పండిందనుకో, అక్కడి ముప్పై అరు ఓట్లూ మనవే'' అన్నాడు. నాయుడు పంతులు భుజాన్ని ఆప్యాయంగా అదిమాడు. ''స్నేహితుడివంటే నీవేనయ్యా పంతులూ! మరోహాపైతే ఆ ఓట్లని మన వంక తిప్ప గలిగేవాడా?'' అంటూ మెచ్చుకున్నాడు. అది విని చంద్రారెడ్డి మొహం ముడుచుకున్నాడు. నాయుడు దాన్ని గమనించి సర్దేయడానికి ప్రయత్నించాడు.

''చంద్రారెడ్డి ఎగువవీధి ఓట్లన్నీ గ్యారంటీచేసేడనుకో పంతులూ!'' అన్నాడు నాయుడు. చంద్రారెడ్డి ముఖం వికసించింది. ''అ నాదేముంది. మీ పేరు చెబితేచాలు అవాళ వాళంతా ఎగబడి మీకు ఓట్లెయ్యరూ నే చెప్పకపోయినా'' అన్నాడుగానీ అతని ముఖంలో చూసారా నా తడాఖా! అనేదీమా కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వుంది

వీరిసెట్టి ''మన నలుగురి పేరిటా పేపర్లు అచ్చేయించడానికి ఆర్డరు యిచ్చి వచ్చాను'' అన్నాడు. నాయుడు ''పోన్లే కానీ, అదీ ఒకందుకు మంచిదే. మరి కాశీపతి, రాజయ్యా ఏం చేస్తున్నట్లు?'' అన్నాడు.

''ఇంకా మీరు వూళ్ళోకి వెళ్ళలేదన్న మాట. సినిమాపోస్టర్లు అంటించినట్లు రెండు మూరల పొడుగు పోస్టర్లు వారి ఫొటోగ్రాఫులేసి ఊరి నడిబజారులో ఎక్కడబడితేఅక్కడ అతికించారు! పైగా రెండు ఊరేగింపుల్తి పెట్టి సాయంకాలం పేపర్లు పంచిపెట్టిస్తారంట.'' అన్నాడు పంతులు కాస్సేపాగి ''ఇది మీరిచ్చిన సలహాయేనంటగా?'' అని ప్రశ్నించాడు

నాయుడు నవ్వి ''ఆమాట ఎవరితోను ప్రసంగవశాత్తూకూడ అనవద్దని చెప్పానే పోన్లే నీవేం పరాయివాడివా, వారు నీతో చెప్పకపోవడానికి, నాకు మూడోకన్ను లాంటివాడివి. నీతో ముందే చెప్పాల్సింది. కానీ తాత్సారం చేసాను అవును ఆ పద్ధతి నేను చెప్పినదే. ఎటొచ్చీ నాతో చెప్పకుండానే తొందర్లో మొదలు పెట్టేసినట్లున్నారు. సరే, మళ్ళీ సాయంత్రం బజార్లో కలుద్దాం. ఏమన్నా పనులున్నాయేమో మీకు, మాటల్లో చాలా సేపు కూర్చొ బెట్టేసాను వెళ్ళిరండి.'' అన్నాడు

చంద్రారెడ్డి, వీరిశెట్టి వీధిలోకి వెళ్ళిపోయారు. నాయుడూ, పంతులూ యింకా

యేవో మంతనాలు సాగించడానికి యింటిలోకి వెళ్ళారు.

అప్పరాజుపేట పంచాయితీ ఎన్నికలు యింకా వారంరోజుల్లో వున్నాయి. ఊరంతా మహాసంరంభంగా వుంది. ఊళ్లో పోటీపడుతున్నవి రెండే రెండుపక్షాలు, ఒకటి ప్రస్తుతపు ప్రెసిడెంటు మాధవరావు పక్షం. మరొకటి ధర్మానాయుడి పక్షం. ప్రచారం అతి వుధృతంగా సాగుతోంది. మాధవరావుకూడా పరపతిలో ధర్మనాయుడికి తీసిపోయేవాడుకాదు. ఒకప్పుడు వారిద్దరూ భాయీ.భాయీ అనుకుంటూ తిరిగిన ఆప్తమిత్రులే. కానీ మాధవరావు పంచాయితీ ప్రెసిడెంటైన తర్వాత అధికారం కోసం వారిద్దరూ ఘర్షణపడ్డారు. అప్పట్లో మాధవరావుదే పైచెయ్యింది. ఆ ఎన్నికల్లో ధర్మనాయుడు పోటీ చేయకపోవడం మూలంగా మాధవరావుకి అధికారమంతా చేజిక్కింది. అయితే అంగబలంలో మాధవరావు ధర్మనాయుడికి తీసిపోకపోయినా అర్థబలంలో నాయుడికి పూర్తిగా తీసికట్టు. కనుక యీమారు తను విజయంసాధించే విషయంలో సంశయిస్తున్నాడు.

పంచాయితీకి మొత్తంవున్నవి ఆరుస్థానాలు. ఉభయపక్షాలూకూడా అన్నిస్థానాలకు పోటీ చేస్తున్నాయి. మొదట్లో ధర్మానాయుడు తనను ప్రెసిడెంటుగా చేయడానికి అవతలిపక్షంవారు అంగీకరిస్తే వారికి బేషరతుగా మూడుస్థానాలు వదిలేస్తానని కబురుపెట్టాడు. కానీ మాధవరావు అందుకు అంగీకరించలేదు. అంతకంటే తనపక్షంవారు ఓడిపోయినా తనకు సంతోషమేనని జవాబు పంపాడు. ధర్మనాయుడిక ఆగలేదు. అన్నివిధాలా ఓటర్లను ఆకట్టుకొనడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. తనకు అతి సన్నిహితులైన వారిని అయిదుగురిని పోటీకి నిలబెట్టి తాను మాధవరావుకి పోటీగా నిలబడ్డాడు.

అది మంచి వర్షాకాలం. వర్షాలు జోరున కురుస్తున్నప్పటికీ యిరుపక్షాలవారూ ఉధృతంగా ప్రచారం చేస్తూనే వున్నారు. తన పక్షంవారికి సరికొత్త గొడుగులు సప్లయి చేయించాడు నాయుడు. గొడుగుల క్రింద ధర్మానాయుడి ప్రచారకదళం మరింత చురుగ్గా తిరుగుతూ ప్రచారం చేస్తోంది. మాధవరావు హోటల్లో ప్రత్యేకంగా ఖాతా పెట్టించి తన ప్రచారదళంవారికి కాఫీ, టిఫిన్లు మస్తుగా వేయించి ఊరి మీదకు దుమికిస్తున్నాడు.

గంటలు గడుస్తున్న కొలదీ ప్రచారాలూ పరిస్థితులూ పతాకావస్థను అందుకొంటున్నాయి. ఇరుపక్షాలూ ఒకే స్థలాన తటస్థపడినపుడు ఘర్షణలుకూడా కలగడం ప్రారంభించాయి.

జోరున కురుస్తున్న వర్షంలోనే పెద్ద పందిర వేయించి, మైకుసెట్లూ, లౌడ్ స్పీకర్లూ తెప్పించి ధర్మానాయుడు పట్టపగలే గ్యాసులైట్లు పెట్టించి మహా ఆర్భాటంగా మీటింగు పెట్టాడు. వచ్చిన వారందరికీ మిఠాయి పొట్లాలు. ప్రత్యేకంగా ఆడవారికి కుంకుమ భరిణలూ పంచి పెట్టించాడు ఇక జనానికి లోటేముంది క్రిక్కిరిసిపోయారు. నాయుడు తన పాచిక పారినందుకు గర్వపడ్డాడు. ఎవరినోట విన్నా నాయుడి దాతృత్వం పొగడ్తే

ఇదంతా చూస్తున్న మాధవరావుకిక కాలు నిలవలేదు వెంటనే తానూ రెండువేలు అప్పుతెచ్చి కార్యక్రమం ప్రారంభించాడు. అతని భార్యా, ఇద్దరు కొడుకులూ ఇంటింటకీ వెళ్ళి చక్రకేళీ అరటి పండ్లనూ, తలో అద్దాన్ని పంచిబెడుతూ "మీ ఓట్లు మాధవరావుగారి పక్షంవారికే వెయ్యండి" అని హెచ్చరించసాగారు. ఊళ్ళో అద్దెకు బండ్లు తోలేవారంతా మాధవరావు పక్షం. "మాధవరావు పక్షంవారికి మీ ఓటు" అని తాటికాయలంతేసి అక్షరాలతో రాసిన బోర్డులను బండ్లకు యిరుప్రక్కలా కట్టుకొని తిరగసాగారు.

ఊరిలో పరిస్థితులు అంత ప్రశాంతంగా లేనందున పై ఊరినుండి మరికొంత ప్రత్యేక పోలీసుబలగం రప్పించబడి, రోజంతటా ముఖ్యమైన స్థలాలన్నింటిలో కాపుంచబడింది. ఏక్షణానైనా రెండు పక్షాలు ప్రత్యక్ష పోరాటానికి తలపడవచ్చుననే భయం ఉండనేవుంది.

ఇదంతా ఇలావుండగా మరొకవంక వర్షాలు ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురుస్తున్నాయి. ఊరిని అనుకొని ప్రవహిస్తున్న "చంద్రవంక వాగు" పొంగి పొర్లుతూంది.

ఊర్లోని ఆవేశ కావేషాల్లాగే బురదతో కలుషితమైన దాని ప్రవాహంకూడా ఏదో ఒక క్షణాన గట్లు తెంచుకొని ఊరిమీద పడేటట్లుంది. ఊరిగట్టు పొడుగునా వాగు తెంచుకు రాకుండా కరకట్టవేశారు రక్షణ కోసం. అయితే అది ప్రస్తుతం చాలా బలహీనంగావుంది. ఏ క్షణానయినా ప్రవాహవేగానికి తెగిపోవచ్చు. ప్రవాహం సుళ్ళుతిరుగుతూ, నురగలు కక్కుతూ, ఒడ్డును ఒరుసుకొని ప్రవహిస్తూ. మెత్తని భాగాలను కోసివేస్తూంది. ఉరవడితో పరుగులు పెడుతూంది.

అంతకుమునుపు ప్రతి సంవత్సరం మాధవరావు. ధర్మనాయుడిలఆజమాయిషీ క్రింద మొత్తం గ్రామప్రజలందరు కరకట్టవి బలపరచడానికి కృషిచేసేవారు వర్షాకాలం దగ్గరలోవుందనగా అధికారం గురించి తగాయిదావచ్చి వారిద్దరూ విడిపోయిన తరువాత ఆసంవత్సరం తమకేమీపట్టనట్లు వారిద్దరూకూడా నిర్లక్ష్యంగా వూరుకున్నారు. అది బాగుచేయించవలసిన బాధ్యత ప్రెసిడెంటుదేనని నాయుడు అంటాడు. నాయుడుకి వత్తాసువచ్చే వారందరూ అమాటే అంటున్నారు వారెవరూ తోడుపడడానికి మొగ్గు చూపించకపోవడం చూసి మాధవరావుకి ఒళ్ళుమండి దాన్నిమరమ్మతు చేయడానికి కావలసిన ధనం మంజూరు చేయించవలసినదని పై అధికారులకి వ్రాసి చేతులు దులుపుకున్నాడు కాస్త ఆలస్యమైనా అందులో కొంపమునిగే అపాయమేమీలేదనినిర్లక్ష్యం వహించాడు.

ఊరికి దక్షిణదిశవంక వాగు భయంకరంగా గర్జిస్తూవుంటే ఉత్తరదిశన శంకరగిరిగుట్టపై ధర్మానాయుడు. మాధవరావు

మీటింగులు పెట్టి ఉపన్యాసాలు దంచుతున్నారు.

శంకరగిరిగుట్ట చాలా పురాతనమైనది. ఏడెనిమిదివందల అడుగుల ఎత్తుగల చిన్న కొండ అది. దానిపైభాగాన రెండుమూడు చదరపుమైళ్ళ విశాలమైన ప్రదేశముంది. గుట్టపైన భోలాశంకరుని ఆలయం నెలకొనివుంది. ఊరివారికేకాక చుట్టుప్రక్కల ఊళ్ళవారికికూడా భోలాశంకరుడు ఆరాధ్య దైవం. చక్కటి అరటితోటా, మామిడితోపూ, తులసివనం ఆ గుట్టశోభను పెంపొందింపజేస్తూ వుంటాయి. చక్కని వనితనంగల శిల్పాలతో ఆలయం చూపులకు విందుచేస్తుంది. ఆలయంచుట్టూ విరగబూచి పరిమళాలు వెదజల్లే పూలతోట దివ్యానుభూతిని కలుగజేస్తుంది.

ఆలయానికి సమీపంలోనే నిరంతరం జలపూరితమైవుండే కోనేరుంది కోనేటి గట్టున విశాలంగా పెరిగిన రెండు మర్రిచెట్లు. మర్రిచెట్లక్రింద నిలుచుంటే సూర్యకిరణం తాకదు: వాన చినుకు రాలదు. అంత దట్టంగా వాటి ఆకులు అల్లుకొన్నాయి, - కొలను స్వచ్ఛమైన తీయని జలాలతో, తామర పువ్వులతో కలకల లాడుతుంటుంది. కొలనుగట్టున పార్వతీదేవి విగ్రహంతో బాటు కుమారస్వామి, విఘ్నేశ్వరుల విగ్రహాలు నెలకొనున్నాయి. ప్రతి సంవత్సరం రెండుమార్లు అక్కడ పెద్ద ఉత్సవాలు జరుగుతాయి. నిత్యకల్యాణం-పచ్చతోరణమైన ఆ ప్రదేశానికి నిరంతరం భక్తులు వస్తూనే వుంటారు గమక వారి సౌకర్యార్థం కొండపైన విశాలమైన వేదికలు కట్టి, వాటిపైన దిట్టమైన పందిళ్లు నిర్మించారు ఒకేమారు ఆయిదారు వేలమంది జనం వాటితో సుఖంగా ఎండా, వానలకు గురికాక స్వేచ్ఛగా మసలవచ్చును క్రిందినుండీ పైదాకా చక్కని మెట్లవరుస ఎనిమిది అడుగుల వెడల్పున మలచబడింది.

ఇక్కడనే ప్రస్తుతం ధర్మానాయుడూ, మాధవరావూ తమ మీటింగులు నడుపుతున్నారు. తమ పక్షాలకక్ష తో, పరస్పర దూషణలలో అక్కడి పవిత్ర వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. అయినా ఆ తప్పు వారు గమనించలేదు వారి దృష్టిలంతా తాము విజయం సాధించడం ఎలా? అనే విషయంపైనే లగ్నమైవుంది. భోలా శంకరుడు పేరుకు తగినట్లు వారి తప్పిదాన్ని సహనంతో భరిస్తున్నాడు

మీటింగులు ముగిసాయి. జనం యిండ్లకు తిరుగుముఖం పట్టారు. సగం మంది వర్షానికి జడిసి పైనే ఉండిపోయారు మాధవరావూ, ధర్మానాయుడు అక్కడున్న ధర్మసత్రాల్లో చెరొక దాంట్లోనో విడిదిచేసి సమాలోచనలు సాగిస్తున్నారు. మరునాడే ఎన్నికలు! వర్షం భోరున కురుస్తుండడం వలన ఆ రాత్రికి మరేమీ ప్రచారం చేయడానికి అవకాశం చిక్కక మిన్నకున్నారు.

తెల్లవారుజామైంది మసక వెలుతురు వచ్చింది. ఏటిగట్టున కాపురమున్న జాలర్లు ఊళ్లోకి ఉరుకులు, పరుగులతో అపు మేఘాలమీద వచ్చిపడి, శంకరగిరి గుట్టవంక పరుగెత్తడం ప్రారంభించారు. మరుక్షణంలో వాగుకట్ట తెంచుకు వచ్చేస్తోందని ఊరు ఊరంతా గుప్పుమంది. జనమంతా బ్రతికుంటే బలుసాకు తినవచ్చని, ప్రాణాలు గుప్పిటలో పెట్టుకొని గుట్టవంక పరుగెత్తసాగారు

వాగు కట్టతెంచుకొని ఊరిమీదకువస్తే ఏమవుతుందో వారిలో చాలామంది ఎనిమిదేళ్ళక్రిందట ప్రత్యక్షంగా అనుభవించే వున్నారు. ఊరంతా భీభత్సమైంది. తొందరచేసే కుటుంబపెద్దలు, ఏడ్చేపసివారూ, తొందరగా అడుగెయ్యలేని వృద్ధుల శాపనార్థాలూ: ఒకటే రణగొణధ్వని. మనుషులప్రాణమే కాపాడుకోవటం కష్టంగా వుంటే యింక గొడ్డూ-గోదను సామానులను రక్షించుకొన జూసేదెవరు? అందరు ఆతృతగా, ఆయాసంతో గుట్టెక్కిపోతున్నారు.

హోరుమనే శబ్దంతోబాటు వాగు ఊర్లోకి విసురుగా విరుచుకుపడింది, పల్లప్రదేశమవడంమూలంగా శరవేగంతో చొచ్చుకొనిపోయింది. ఇళ్ళు పేకమేడల్లా కూలిపోతున్నాయి. చెట్లు ఫెళఫెళమంటూ వేళ్ళతోసహా తెగిపోతున్నాయి. జంతువులు దీనంగా అరుస్తూ నీటిలో కొట్టుకుపోతున్నాయి. ఎంతభయంకరంగావుందా వరద విలయతాండవం!

ప్రకృతిమాత ప్రశాంతంగా వున్నపుడు బిడ్డను ప్రేమతో లాలించే కన్నతల్లిలా మానవుడికి గోచరిస్తుంది. విజృంభించినపుడుమాత్రం ఆగ్రహంతో మండిపడుతున్న ఆదిశక్తిలా దర్శనమిస్తుంది.

ప్రవాహం ఒడ్డుల హద్దులతో ప్రవహించినంతకాలం మనిషికి చాలా సహకారిణి. అది ఎప్పుడైతే హద్దులను దాటిందో అప్పుడు వినాశకారిణి. మలయమారుతం ఆనందం కలిగిస్తుంది. విజృంభించినపుడు తుఫానై వేధిస్తుంది. భూమి లేకుండా మనిషి నిలవడు. కాని అదే భూమి ప్రళయంగా కంపించినపుడు దానిని విడిచిపెట్టి పారిపోవడానికి ప్రయత్నిస్తాడు. అగ్ని అతని జీవితంలో ఒక భాగం. అయినా అది కారుచిచ్చు అయితే భయంకరం సముద్రం చెలియలికట్ట దాటనంతకాలం మానవుడికి హితమైనదే. చెలియలికట్ట దాటివచ్చిందా సర్వనాశనం.

ఈ మాటను జ్ఞాపకంచేస్తూ వరదవేగం వెనుబడినవారినందరినీ ఆక్రమించింది. అడ్డువచ్చిన వాటినన్నింటినీ మింగేసి తనలో లీనం చేసుకుంది. ఎవరిమీదా కనికరం చూపించలేదు ఎదుటపడిన వాటన్నింటినీ మృత్యు దేవతలా ఆహుతి గొంటూంది. ఎన్నో సంవత్సరాలు కష్టంమీద తయ్యారైన ఊరిని క్షణాల్లో నాశనం చేసింది వరద. కోతకు సిద్ధంగా వున్న పంటచేలన్నీ మున్నీటిపాలయ్యాయి. ఊరిలో ఏదీకూడా వరద దెబ్బనుంచి తప్పించుకొనలేదు శంకరగిరి గుట్టతప్ప. అది మాత్రం చుట్టూ నిలిచిన వరదనీటితో ఆది వరాహం కొమ్ముపైన నిలిచిన భూమిలా, సముద్రంలోని దీవిలా అచలంగా నిలిచింది. కళకళలాడే వూరు

(తరువాయి 28 వ పేజీలో)

## పోరు నష్టం

(18వ పేజీ తరువాయి)

స్మశానంలా నిర్జీవంగా మారిపోయింది. ధర్మానాయుడు తన ఐశ్వర్యమంతా నీటి పాలు కావడం చూసి నిట్టూర్చాడు. మాధవ రావు గుట్టపైకిరాని తనకుటుంబం నీటి పాలైందని తెలుసుకొని దుఃఖభారంతో ఆకసంవంక చూస్తున్నాడు. ధర్మానాయుడు అతనిభుజంపైన సానుభూతిగా చెయ్యి వేసాడు. ఇద్దరూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. తామిద్దరూ యిందుకు కొంత వరకూ కారకులే. దోషానికితగిన ప్రాయశ్చిత్తం జరిగింది. కానీ నిర్దోషులుకూడా యిందులో యిరుక్కున్నారు. ఈ ఐకమత్యం మునుపే సాధించివుంటే తమకీ దుర్గతి పట్టేదా?

ధర్మానాయుడి దృష్టిని ఒకవిషయం ఆకర్షించింది. పాపం జోగయ్యపంతులు వరదనీటిలో కొట్టుకొని పోతున్నారు. తను అతడిని రక్షించగలడా? ఒక్క కన్నీటిబొట్టు మాత్రం రాల్చగలిగాడు. అంత ప్రమాదావస్థలోకూడా పంతులు అలవాటుప్రకారం గొడుగు వేసుకొని వుండడం చూసి నాయుడికి అంత విచారంలోనూ కొద్దిగానవ్వు వచ్చింది. క్రమంగా పంతులు దూరమైపోయాడు

గుట్టమీద జనమంతా తమ పక్షాలూ, కక్షలూ మరచిపోయి ఒకటిగా కలిసి పోయారు వాగువరద ఊరితోబాటు వారి ద్వేషాలను, అసమానత్వాన్ని తాత్కాలికంగానైనా తొలగించగలిగింది. అందరూ కలసి కట్టుగా తిరుగుతున్నారు మాధవ రావూ, ధర్మానాయుడూ ఒకటయ్యారు.

మధ్యాహ్నానికి ఉరవడి తగ్గింది. దగ్గరలోవున్న పట్టణానికి యీ ప్రమాదవార్త అందినతక్షణం సహాయకదళాలు వచ్చి వాలాయి. సహాయకదళంతోబాటు ఆహార పదార్థాలు, పాలూ, బట్టలూ, మందులూ వచ్చాయి. అవి జనానికి పంచడంలో మాధవరావూ, ధర్మానాయుడూ తోడ్పడ్డారు. జనంలో కాస్త హుషారు పుట్టింది.

ఇప్పటికైనా తనసంతతైన వారందర్నీ ఒకటిగా చేయగలిగినందుకు భోళాశంకరుడు ఆనందించి వారిని ఆశీర్వదిస్తున్నట్లు ధ్వజస్థంభంమీద చిరుగంటలు గాలికికదిలి గణగణమంటూ శ్రావ్యంగా మ్రోగాయి!

—o—

## విరిగిన కెరటం

(26వ పేజీ తరువాయి)

పెద్ద పెట్టున హారన్ కొట్టి సడన్ బ్రేకులు వేసుకుని లారి ఆగింది. మంచినీళ్ళు తీసుకువస్తున్న కుంటివాడు మంచినీళ్ళ డబ్బా క్రిందపారేసి, అన్నా! అన్నా! అంటూ గుడ్డివాడి దగ్గరకు రావడం మొదలు పెట్టాడు.

“కళ్ళు కనిపించడం లేదా''లారీ డ్రైవర్ అరిచాడు.

నీ బలమే
నీ జాతిబలం

“కళ్ళు లేని కబోదిని బాబయ్యా.... అంటూ గుడ్డివాడు అన్నాడు. కాలుస్తున్న బీడి క్రింద పారేసి, లారి డ్రైవరు క్రిందకువచ్చి, చెయ్యి పుచ్చుకుని, గుడ్డివాడిని కుంటివాడి దగ్గర చేర్చాడు. చేతిలో ఒక పది నయాపైసల బిళ్ళ పెట్టాడు. గుడ్డివాడు. డబ్బు తడిమి చూసుకుని జాలిగల మహారాజువి పిల్లా జెల్లాతో పది కాలాలపాటు సుఖంగా వుండుదొరా'' అని దీవించాడు. లారిడ్రైవరు ఏం మాట్లాడలేదు. లారి దగ్గరకు వచ్చి యింకొక బీడీ ముట్టించాడు. కాని కళ్ళ వెంబడి ఆగకుండా కన్నీరు

“ఎందుకు ఏడుస్తున్నాడు''అని రోడ్డున పోయే వాళ్ళెవరో అడిగారు.

“ఇల్లు కూలి మొన్న అతని భార్య యిద్దరు పిల్లలు పోయారు'' అని క్లీనరు సమాధానం చెప్పాడు.

“పాపం!'' అని నలుగురు అన్నారు.

నిట్టూర్పు విడిచి రామం కిటికీ దగ్గర నుంచి వెనక్కి తిరిగాడు.

“కోపం వద్దు రామం'' అంటూ శ్యామలా వాళ్ళనాన్నగారేదో చెబుతున్నారు.

(ఇంకా వుంది)

## ప్రకటన

విజయవాడ డి॥ మునసబు కోర్టులో

A. I. S. C. 640/61

E. P. 288/63

అహమ్మద్ బేగ్‌గారు - వాది

తూమాటి లక్ష్మీ బాయమ్మ వగైరా - ప్రతివాదులు

వాదిక్కి, ప్రతివాదులు యివ్వవలసిన డిక్రీ బాకీకిగాను, ప్రతివాదులతాలూకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 7-10-63 తేదీని సదరు కోర్టువారి వలన 11 గంటలకు వేలం వేయబడును గాన కావలసినవారు పాడుకొనవచ్చును.

షెడ్యూలు

కృష్ణాజిల్లా విజయవాడ సబు డి॥ యిలాకా విజయవాడ అరండల్‌పేట మౌలానా స్ట్రీటులో N. T. S. No. 649 రు రి॥ వార్డు నెం. 9 రు బ్లాకు నెం. 10 రు మ్యునిసిపల్ వార్డు నెం. 25 రు డోర్ నెం 25-33 275 గ్లు గల పెంకుటి యింటికి హద్దులు.

తూర్పు: గోకన రామకోటి
దక్షిణం: ఖానూబీ
పడమర: రోడ్డు
ఉత్తరం: నాంపల్లి వెంకటరత్నం

యీ హద్దులమధ్య షుమారు చ॥గ॥ 100ల స్థలమున్నూ అందులోని పెంకుటి యిల్లు. కల్ప సామానులు సహా సర్కారు పాట తనఖాకు లోబడి రు. 1000-00

సయ్యద్ హుస్సేన్
వాది తరపు వకీలు